మల్కాజిగిరి ఓట్ల లెక్కింపు ప్రశాంతం

● కౌంటింగ్‌ను పర్యవేక్షించిన కలెక్టర్, పోలీసు అధికారులు ● ప్రతీ రౌండ్‌లోనూ బీజేపీదే అధిక్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: కీసర మండలం భోగారం హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాలలో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో ఎల్బీనగర్, బేగంపేట వెస్లీ కాలేజీలో కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మూడంచెల భద్రతతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హోలీమేరీ కాలేజీలో మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఇందులో 575 మంది సిబ్బంది విధులు నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రంలో బరిలో ఉన్న పార్టీల అభ్యర్థుల తరఫున ఏజెంట్లు హాజరుకాగా, ఒక టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్‌వైజర్, మైక్రోఅబ్జర్వర్ విధులు నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియా సెంటర్‌తో పాటు ఎప్పటికప్పుడు ఎన్నికల ఫలితాల సమాచారం కోసం ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రాలను తరచుగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్, పోలీసు అధికారులు పర్యవేక్షించగా, పలువురు డీసీపీలు, ఏసీపీలు, పదుల సంఖ్యలో సీఐ, ఎస్ఐలు, వందలాది పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఉత్కంఠ భరితంగా..

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు ఆద్యాంతం ఉత్కంఠరితంగా సాగింది. మేడ్చల్,కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని లెక్కింపులో ప్రతీ రౌండ్‌లో మొదటి నుంచి బీజేపీ అధిక్యతను చాటింది. ఫలితం బీజేపీకి అనుకూలంగా ఉండడంతో ఆ పార్టీ అభ్యర్థులు, వారి ఏజెంట్లు గెలుపు ధీమాతో ఆనందాన్ని వ్యక్తం చేయగా, మిగితా పార్టీల ఏజెంట్లు మాత్రం కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోవడం కనిపించింది. ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగానే.. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోగా, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాత్రం చివరి వరకు కౌంటింగ్ కేంద్రంలోనే ఓట్ల లెక్కింపును పర్యవేక్షించారు. కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి కూడా కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు సరళిని పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాన్ని ఎన్నికల నోడల్ అధికారులు పర్యవేక్షించారు. కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, అగ్నిమాపక వాహనంతో పాటు హాలులో టవరింగ్ ఏసీలు, భోజన వసతి, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించారు.

69,376 ఓట్ల ఆధిక్యత సాధించిన ఈటల

మేడ్చల్/పోచారం: కీసర మండలం భోగారంలోని హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాలలో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మేడ్చల్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపును మంగళవారం చేపట్టారు. అధికారులు టేబుళ్లు ఏర్పాటు చేసి 21 రౌండ్ల పాటు కౌంటింగ్ నిర్వహించారు. నియోజకవర్గంలో 6,65,979 మంది ఓటర్లుండగా 3,85,129 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మేడ్చల్‌లో 1,86,819 ఓట్లతో మొదటి స్థానం సాధించారు. 1,17,443 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి రెండో స్థానం, 66,485 ఓట్లతో బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి మూడో స్థానంలో నిలిచారు. మొత్తంగా ఈటల 69,376 ఓట్ల ఆధిక్యతను సాధించారు.

ఈటల మెజార్టీ కంటే బీఆర్ఎస్ అభ్యర్థికి తక్కువ ఓట్లు..

ఈటల రాజేందర్‌కు 1,86219 ఓట్లు రాగా ఆయనకు 69,376 ఓట్ల మెజార్టీ లభించింది. అయితే బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 66485 ఓట్లు మాత్రమే లభించగా ఈటల మెజార్టీ కంటే 2891 ఓట్లు తక్కువగా వచ్చాయి.

రౌండ్ల వారీగా ఎవరికెన్ని ఓట్లు..

రౌండ్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	లీడ్
1	7790	7590	3747	200(బీజేపీ)
2	9577	5134	2715	4443 '
3	8841	5167	2428	3674 '
4	6873	5833	4225	1040 '
5	8980	6731	3305	2249
6	8357	5476	3279	2881
7	7561	6855	2641	706
8	10458	5817	2770	4641
9	10495	5101	2867	5394
10	8643	5514	3101	3129
11	7986	6396	3381	1590
12	7770	5252	2405	2518
13	8426	5829	3434	2597
14	10569	6770	3255	3799
15	12379	4318	3561	8061
16	11063	4942	3475	6121
17	11155	4331	2737	6824
18	9236	4632	2644	4694
19	9453	5584	3489	3869
20	6627	5309	3642	1318
21	4580	4862	3384	282(కాంగ్రెస్)
మొత్తం.	1,86,519	117443	66485	69376

బీజేపీ హ్యాట్రిక్ విజయం.. కాశీ పాదయాత్రకు సన్నద్ధం

శివ భక్తుడు బూనేటి కిషన్‌రెడ్డి



చింతల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించి మూడోసారి ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టనుండటం ఎంతో సంతోషంగా ఉందని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన శివ భక్తుడు బూనేటి కిషన్ రెడ్డి అన్నారు. దేశంలో బీజేపీ గెలిచిన నేపథ్యంలో శ్రీవైద్యనాథ స్వామి దేవాలయం భైరవగుట్ట నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం వరకు పాదయాత్రగా వెళ్లి మొక్కును చెల్లించుకోనున్నట్లు తెలిపారు. మల్కాజ్‌గిరి నుంచి ఈటల రాజేందర్ గెలవడం ఆనందంగా ఉందన్నారు.

ప్రైవేట్ ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్

పటాన్‌చెరు టౌన్: అనుమతులు లేకుండా అడ్మిషన్లు ఇస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న వేళ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల, కళాశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని అదేవిధంగా ఫీజులో నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా కొన్ని బడా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం భారీగా వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల విద్యార్థులకు 25% ఉచితంగా విద్యను అందించాలన్నారు.

అటకెక్కిన పారిశుద్ధ్య నిర్వహణ



ఐడీపీ గాంధీనగర్ పరిధిలోని మ్యాన్‌హోల్‌లో చెత్తను తొలగిస్తున్న స్థానికుడు



చిత్తడిగా మారిన రంగారెడ్డినగర్ ప్రధాన రహదారి

రంగారెడ్డినగర్: గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ అటకెక్కింది. దీంతో పారిశ్రామికవాడ ప్రాంతాల్లోని ప్రధాన డ్రైనేజీ లైన్లలో చెత్త పేరుకుపోయి మురుగు రోడ్లపైకి పారుతోంది.. మంగళవారం రంగారెడ్డినగర్‌ను ఆనుకుని ఉన్న గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి పెద్ద ఎత్తున మురుగు ఏరులై పారింది. దీంతో ఈ రహదారిలో రాకపోకలు సాగించే పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులే మ్యాన్‌హోళ్లలో కర్రలతో చెత్తను తొలగిస్తూ కనిపించారు. ప్రతిఏటా పారిశ్రామికవాడలోని పరిశ్రమల యాజమాన్యాల నుంచి లక్షల్లో పన్నులు వసూలు చేస్తున్నా పారిశుద్ధ్య విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు పారిశ్రామికవేత్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎట్టకేలకు స్పందించారు.. ప్రహరీని కూల్చారు!



సర్వే నం.4లో కట్టుకాలువపై వెలిసిన ప్రహరీని కూల్చివేసిన అధికారులు

సుభాష్‌నగర్: చెరువు కట్ట కాలువపై వెలసిన మరో నిర్మాణాన్ని అధికారులు తొలగించారు. తుమార్ చెరువు దిగువ భాగాన తూము నుంచి వెళ్లే కట్టు కాలువ కబ్జా విషయాన్ని మే 29న 'సాక్షి'వెలుగులోకి తీసుకొచ్చింది. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సోమవారం సర్వే నం.2లోని కొంత భాగాన్ని కూల్చివేసి వెళ్లిపోయారు. ఈ విషయమై మంగళవారం అధికారుల నిర్లక్ష్యాన్ని మరోసారి 'సాక్షి'వెలుగులోకి తీసుకురావడంతో మంగళవారం ఉదయం సర్వే నం.4లో వెలిసిన మరో ప్రహరీని తొలగించారు.

ఈ బాలుడు తప్పిపోయాడు.. గుర్తుపడితే సంప్రదించండి



జగద్గిరిగుట్ట: తప్పిపోయిన బాలుడు పోలీసుల చెంత చేరిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం 4గంటల సమయంలో జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీ సమీపంలో యశ్వంత్(03) తప్పిపోయి రోధిస్తూ కనిపించాడు. స్థానికులు బాలుడి వివరాలు అడుగగా తన పేరు యశ్వంత్ అని చెప్పాడు. ఇతర వివరాలు చెప్పకపోవడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు బాలుడిని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఎవరైనా బాలుడి సంబంధీకులుంటే స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు పేర్కొన్నారు.

వృథాగా తాగునీరు



జీడిమెట్ల: తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో నీరు రోడ్డుపై వృథాగా పోతోంది. జీడిమెట్ల ఫేజ్-5లోని రాంరెడ్డినగర్ రోడ్డులో మంచినీటి పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో వేల లీటర్ల తాగునీరు రోడ్డుపాలు అవుతోంది. అధికారులు పట్టించుకుని పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

విజయోత్సాహం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ సంబురాలు



షాపూర్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో రాష్ట్ర నేత మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్, జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి, బక్క శంకర్‌రెడ్డి



కొంపల్లిలో బీజేపీ సంబరాల్లో పాల్గొన్న అసెంబ్లీ కో.కన్వీనర్ శివాజీరాజు, జిల్లా నాయకుడు రాజిరెడ్డి

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ ఎంపీగా ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలవడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మంగళవారం బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. కొంపల్లిలో కో.కన్వీనర్ శివాజీరాజు, జిల్లా నాయకుడు రాజిరెడ్డిల ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. అదే విధంగా షాపూర్‌నగర్‌లో రాష్ట్ర నాయకుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్, బక్క శంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు. నిజాంపేట్‌లో కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ బలపడుతోందని, కేంద్రంలో మళ్లీ ప్రధాని మోడీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం సంతోషకరంగా ఉందన్నారు.





నిజాంపేట్‌లో కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో బాణసంచా కాలుస్తున్న పార్టీ శ్రేణులు

ఒకప్పుడు ఇక్కడ ఇంకుడు గుంతలు ఉండేవి!

● నేడు చెత్త డంపింగ్‌కు అడ్డాగా మారిన వైనం ● పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలోని ఇంకుడు గుంత చెట్ల ఆకులతో పూడుకుపోయిన దృశ్యం



ఐలా ఆధ్వర్యంలో నందానగర్ రోడ్డులోని గాంధీనగర్ పారిశ్రామిక వాడ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత పరిస్థితి ఇది

రంగారెడ్డినగర్: డివిజన్ పరిధిలో 'ఒకప్పుడు ఇక్కడ ఇంకుడు గుంతలు ఉండేవి'అని చెప్పుకునే దుస్థితి నెలకొంది. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అధికారులే ఇంకుడు గుంతల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు వర్షపునీటిని ఒడిసి పట్టేందుకు అధికారులు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు నిర్వహణ కొరవడటంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

◆ జంట సర్కిళ్ల పరిధిలోని 8 డివిజన్లు, గాంధీనగర్, జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతాల్లో పదేళ్ల కిత్రం 200 పైచిలుకు ఇంకుడు గుంతలను జీహెచ్ఎంసీ, ఐలా, జలమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

◆ మొదట్లో ఇంకుడు గుంతల నిర్వహణ సక్రమంగా నిర్వహించిన అధికారులు రాను రాను వాటిని పట్టించుకోవడం మానేశారు. దీంతో లక్షలాది నిధులతో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు నేడు పూడుకుపోయి చుక్క నీరు భూమిలోకి ఇంకని పరిస్థితి నెలకొంది.

వేయి ఫీట్లు వేసినా పడని నీరు..

◆ జంట సర్కిళ్ల పరిధిలో భూగర్భ జలాలు అడుగంటడంతో నేడు వెయ్యి ఫీట్లు పైబడి బోర్లు వేసినా నీరు పడటం లేదు. ఒక్కోసారి బోర్లు ఫెయిల్ కావడంతో రెండు, మూడు చోట్ల బోర్లు వేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. జీడిమెట్ల, సూరారం, ఐడీపీఎల్, జగద్గిరిగుట్ట, పేట్‌బషీరాబాద్, సుచిత్ర ప్రాంతాల్లో 1500 ఫీట్లు వేస్తేనే గాని నీరు పరిస్థితి నెలకొంది.

మొక్కుబడిగా అధికారుల ప్రతిజ్ఞలు..

◆ ప్రతి ఏడాది ప్రపంచ నీటి దినోత్సవం నాడు అధికారులు మొక్కుబడిగా ప్రతిజ్ఞలు, ర్యాలీలు చేయించడం పరిపాటిగా మారింది. ఆ ఒక్కరోజే వర్షపునీటిని పెంపొందించేందుకు తాము ఏదో చేస్తున్నట్లు ప్రకటనలు గుప్పించడం.. ఆపై వాటిని పట్టించుకోవడం లేదు..

చెత్త డంపింగ్‌కు అడ్డాగా ఇంకుడు గుంత..

◆ కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలో స్థానికంగా చెట్ల నుంచి రాలిన ఆకులను డంప్ చేస్తున్నారు. దీంతో ఇంకుడు గుంత ఆనవాలే లేకుండా పోయింది. సర్కిల్ కార్యాలయంలోనే ఇంకుడు గుంతల పరిస్థితి ఇలా ఉంటే ఇంక కాలనీలు, బస్తీల్లో ఎలా ఉంటుందో ఇట్టే అవగతమవుతోంది.

వర్షాలు ఆరంభమైనా పూడిక తీయని గుంతలు..

◆ ప్రతి సంవత్సరం వేసవిలో ఆయా బస్తీలు, కాలనీల్లో పూడుకు పోయిన ఇంకుడు గుంతలను పూడిక తీసి తిరిగి వర్షపునీరు భూమిలోకి రిఛార్జి అయ్యేలా పనులు చేపట్టాల్సి ఉంటుంది.. ఈ విషయంలో స్థానిక బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాలకు అవగాహన కల్పించి పూడికతీతలో భాగస్వాములు చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.



ఆదర్శనగర్ కాలనీలో పూడుకుపోయిన ఇంకుడు గుంత

కుత్బుల్లాపూర్‌లో కమల వికాసం

● బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ ● పోటీలో కానరాని బీఆర్ఎస్

- ఇక్కడ అసెంబ్లీలో గెలిచినా లోక్‌సభలో బోల్తాపడిన బీఆర్ఎస్
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనే 1,77,122 ఓట్లు సాధించిన ఈటల
- ఆ తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు
- దేశంలో అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గమైన మల్కాజ్‌గిరిలో ఈటలదే విజయం

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ముందు నుంచి ఏదైతే ఊహించారో అదే జరిగింది. ఇక్కడ కేవలం బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ జరిగింది. కానీ కాంగ్రెస్ అనుకున్నట్లుగా వారి అభ్యర్థికి ఓట్లు పడకపోవడంతో ఆపార్టీ శ్రేణులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఏది ఏమైనా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీజేపీ హవా కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికలకు, లోక్ సభ ఎన్నికలకు స్పష్టమైన తేడా కనిపించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభావం ఈ ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో కనిపించింది. మినీ ఇండియాగా పేరున్న మల్కాజిగిరిలో దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు ఇక్కడ నివాసం ఉంటున్నారు. అంతే కాకుండా దేశంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గం సైతం ఇదే కావడం విశేషం.

కుత్బుల్లాపూర్‌లో ఈటలకు భారీ ఆధిక్యత..

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సైతం ఇదే పరిస్థితి దేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు వివిధ రాష్ట్రాల ప్రజలకు ఇక్కడ నివాసం ఉంటున్నారు. మంగళవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో భారీ ఆధిక్యత లభించింది.

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 7,24,992 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 3,63,949 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలైన ఓట్లల్లో ఏకంగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 48.66 శాతం ఓట్లు (1,77,122) వచ్చాయి.

◆ అదే విధంగా కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డికి 33.23 శాతం (1,20,952)ఓట్లు లభించాయి.

◆ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిరి లక్ష్మారెడ్డికి కేవలం 15.94 శాతం (58,039) ఓట్లు మాత్రమే లభించాయి.

◆ సమీప ప్రత్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై ఈటల రాజేందర్ ఏకంగా 15శాతం ఓట్ల శాతం ఎక్కువగా సాధించడం విశేషం.

అసెంబ్లీ.. లోక్‌సభ ఎన్నికలకు భారీ తేడా..

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు, ప్రస్తుతం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు సాధించిన ఓట్ల శాతంలో భారీ తేడా కనిపించింది.

◆ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన కేపీ వివేకానంద్‌కు 1,87,999 ఓట్లు లభించాయి. నాడు బీజేపీ నుంచి పోటీ చేసిన కూన శ్రీశైలం గౌడ్‌కు 102,423 ఓట్లు లభించాయి.

◆ ఇక కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొలను హన్మంతరెడ్డికి 1,01,554 ఓట్లు లభించాయి. కాని ఈ లోక్‌సభ ఎన్నికల్లో నాటి అంచానాలు తలకిందులైపోయాయి.

అప్పుడు 1,87,999 ఓట్లు.. ఇప్పుడు 58,038 ఓట్లు

అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి స్థానంలో ఉన్న బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 58,038 ఓట్లు మాత్రమే వచ్చాయి. బీజేపీకి 1,77,122 ఓట్లు వచ్చాయి. ఇక కాంగ్రెస్‌కు 1,20,952 ఓట్లు వచ్చాయి.

కూన కాంగ్రెస్ గూటికి చేరినా..

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కొలను హన్మంతరెడ్డిలు ఇద్దరు ఒకే పార్టీలో ఉన్నప్పటికీ ఓట్లు మాత్రం ఆశించిన స్థాయిలో రాకపోవడం పట్ల కాంగ్రెస్ పార్టీ వర్గాలు కొంత నిరాశకు గురయ్యారు.

19మంది స్వతంత్రులను వెనక్కు నెట్టిన నోటా...

మొత్తం 23 మంది అభ్యర్థులు లోక్ సభ ఎన్నికల్లో బరిలో ఉండగా అందులో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను మినహాయిస్తే మరో 19 మంది స్వతంత్రులు పోటీ చేశారు. అయితే ఈ 19 మంది స్వతంత్రుల కంటే ఎక్కువ ఓట్లు నోటాకు 2,322 ఓట్లు రావడం గమనార్హం. అంటే 19 స్వతంత్ర అభ్యర్థులు నోటా కంటే తక్కువ ఓట్లు లభించాయి.